సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం, 5, జూన్, 2024

పాలమూరు అభివృద్ధికి కృషి..

ఈ విజయం ఉమ్మడి జిల్లా ప్రజలకు అంకితం చేస్తున్నా. నా గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. ఇక్కడ నన్ను ఓడించడానికి సీఎం రేవంత్‌రెడ్డి 11 సార్లు వచ్చి ప్రచారం చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించకపోతే ఇక్కడ అభివృద్ధి ఆగిపోతుందనే భయాన్ని సృష్టించారు. ప్రజలను భయపెట్టినా.. పాలమూరు పార్లమెంట్ ఓటర్లు నన్ను విశ్వసించారు.. మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించాం. ఈ ప్రాంతంలో విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులతోపాటు జిల్లా అభివృద్ధి కోసం కృషిచేస్తాను.

– డీకే అరుణ, ఎంపీ, మహబూబ్‌నగర్

సేవకుడిలా పనిచేస్తా..

దేశంలో ఇండియా కూటమి ఏర్పడటానికి ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా ముందుంటాను. నా గెలుపును సోనియాగాంధీకి అంకితం చేస్తున్నా. నా గెలుపు కోసం కష్టపడిన ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, ఓటు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. నాకు అవకాశం వచ్చేలా కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మల్లుభట్టి విక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు. ఒక్క పార్టీ విషయాలు మినహాయిస్తే మిగతా విషయాల్లో పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాను. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నాకు గుడిలాంటిది. ఇక్కడి ప్రజలకు పూజారిలా, ఒక సేవకుడిలా పనిచేస్తాను.

– మల్లురవి, ఎంపీ, నాగర్‌కర్నూల్

● కమలం.. హస్తం

చెరొకటి..!

పాలమూరులో బీజేపీ.. నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ జయకేతనం

- మహబూబ్‌నగర్ లోక్‌సభలో ఉత్కంఠగా ఓట్ల లెక్కింపు
- 4,500 స్వల్ప ఓట్ల ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిపై గెలుపొందిన డీకే అరుణ
- సీఎం రేవంత్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా.. తప్పని పరాభవం
- కందనూలులో 94,414 ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌పై మల్లురవి విజయం
- 2 సిట్టింగ్ స్థానాల్లోనూ 'కారు' డీలా.. మూడో స్థానంతో సరి



మహబూబ్‌నగర్‌లో అభివాదం చేస్తున్న డీకే అరుణ

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠకు తెరపడింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో మంగళవారం చేపట్టిన ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసింది. మహబూబ్‌నగర్‌కు సంబంధించి పాలమూరు యూనివర్సిటీలో ఓట్ల గణన కొనసాగగా.. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ, కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మధ్య చివరి రౌండ్ వరకు విజయం దోబూచులాడింది. ఉత్కంఠగా సాగిన లెక్కింపులో చివరకు డీకే అరుణ 4,500 ఓట్ల తేడాతో చల్లాపై విజయం సాధించారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు జిల్లా కేంద్రంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనసాగగా... కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి 94,414 ఓట్ల మెజార్టీతో గెలుపు తీరం చేరారు. రెండు సిట్టింగ్ స్థానాల్లోనూ బీఆర్ఎస్ డీలా పడగా.. మూడో స్థానంతో సరిపెట్టుకుంది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్



నాగర్‌కర్నూల్ ర్యాలీలో అభివాదం చేస్తున్న మల్లురవి



పీయూ ఎదుట బీజేపీ శ్రేణుల సంబరాలు



సీఎం రేవంత్‌కు ఎదురుదెబ్బ


ఉమ్మడి పాలమూరుకు చెందిన సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలపైనా ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఆయన ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సుమారు పదిసార్లు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఓటమి పాలుకావడం.. తాజాగా పార్టీ మహబూబ్‌నగర్ అభ్యర్థి కూడా ఓటమి చెందడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నిరాశ అలుముకుంది. ఇది రేవంత్‌రెడ్డికి ఎదురుదెబ్బగా రాజకీయ వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తొలిసారి టెండర్ ఓటు

పాలమూరు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో జరిగిన ఎన్నికల్లో ఈసారి టెండర్ ఓటు నమోదైంది. టెండర్ ఓటు అంటే ఒక ఓటరు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లినప్పుడు అప్పటికే సదరు ఓటరు ఓటు ఇతరులు వేసి వెళ్లడం.. ఇలాంటి సందర్భాల్లో ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తే మీ గుర్తింపును ధ్రువీకరించిన తర్వాత టెండర్ ఓటు వేసుకునే అవకాశం కల్పిస్తారు. అయితే ఇలాంటి పరిస్థితిలో ఓటరు ఈవీఎంలో కాకుండా బ్యాలెట్ సహాయంతో ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది. తమ ఓటు గల్లంతైందని ఫిర్యాదు చేసే వ్యక్తుల కోసం ఎన్నికల సంఘం టెండర్ ఓటు సద్వినియోగం చేసుకునే అవకాశం కల్పించింది.

నోటాకు 4,330 ఓట్లు

పాలమూరు/ నాగర్‌కర్నూల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఓట్ల లెక్కింపులో నోటాకు 4,330 ఓట్లు వచ్చాయి. ఈవీఎంలో 4,286 మంది నోటాకు ఓటు వేస్తే పోస్టల్ బ్యాలెట్‌లో 44 మంది నోటాకు వేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో నోటాకు 10,599 వస్తే ఈసారి 4,330 మాత్రమే వచ్చాయి. గత ఎన్నికలతో పోల్చితే ప్రస్తుతం చాలా తగ్గాయి. మొదటి రౌండ్‌లో 248, రెండో రౌండ్‌లో 226, నాలుగో రౌండ్‌లో 211, ఐదో రౌండ్‌లో 217, ఆరో రౌండ్‌లో 252, ఏడో రౌండ్‌లో 258, 8వ రౌండ్‌లో 224, 9వ రౌండ్‌లో 192, 10వ రౌండ్‌లో 182, 11వ రౌండ్‌లో 199, 12వ రౌండ్‌లో 208, 13వ రౌండ్‌లో 222, 14వ రౌండ్‌లో 225, 15వ రౌండ్‌లో 216, 16వ రౌండ్‌లో 196, 17వ రౌండ్‌లో 230, 18వ రౌండ్‌లో 230, 19వ రౌండ్‌లో 198, 20వ రౌండ్‌లో 131, 20వ రౌండ్‌లో 30 ఓట్లు నోటాకు వచ్చాయి.



నాగర్‌కర్నూల్ పరిధిలో 4,580..

నాగరకర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో నోటాకు 4580 ఓట్లు వచ్చాయి. ఈవీఎంలో 4,511 మంది నోటాకు ఓటు వేస్తే.. 69 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా నోటాకు ఓటు వేయడం జరిగింది. 2019 ఎన్నికల్లో 13,525 మంది నోటాకు ఓటు వేయగా.. ఈసారి కేవలం 4,580 ఓట్లు మాత్రమే వచ్చాయి. రౌండ్ల వారీగా చూస్తే.. మొదటి రౌండ్‌లో 220, రెండో రౌండ్‌లో 238, మూడో రౌండ్‌లో 228, నాలుగో రౌండ్‌లో 208, ఐదో రౌండ్‌లో 213, ఆరో రౌండ్‌లో 243, ఏడో రౌండ్‌లో 236, ఎనిమిదో రౌండ్‌లో 247, తొమ్మిదో రౌండ్‌లో 236, పదో రౌండ్‌లో 226, 11వ రౌండ్‌లో 213, 12వ రౌండ్‌లో 218, 13వ రౌండ్‌లో 210, 14వ రౌండ్‌లో 266, 15వ రౌండ్‌లో 221, 16వ రౌండ్‌లో 239, 17వ రౌండ్‌లో 217, 18వ రౌండ్‌లో 236, 19వ రౌండ్‌లో 185, 20వ రౌండ్‌లో 130, 21వ రౌండ్‌లో 63, 22వ రౌండ్‌లో 14 ఓట్లు వచ్చాయి.

ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ

పాలమూరు: మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఇటు పోటీ చేసిన అభ్యర్థులతో పాటు.. అటు ద్వితీయ శ్రేణి నాయకులు, పార్టీల కార్యకర్తలు ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ కనిపించింది. మొదటి రౌండ్ మొదలు కావడానికి కొన్ని క్షణాల ముందు కౌంటింగ్ కేంద్రం దగ్గర బిజీబిజీగా తిరిగారు. మొదటి రౌండ్ ప్రారంభమై.. ఫలితాలను మైక్‌లో చెప్పడంతో కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎదురు చూస్తున్న కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. మొదటి రౌండ్ నుంచి బీజేపీ అభ్యర్థి ముందంజలో దూసుకుపోవడం చూసి కౌంటింగ్ కేంద్రానికి వచ్చిన వాళ్లు ఫోన్ల ద్వారా స్నేహితులు, ఇతర కార్యకర్తలకు సమాచారం ఎప్పటికప్పుడు చేరవేశారు. ఎన్నికల ఫలితాలు మొత్తం ఫోన్ల ద్వారా బయటి వ్యక్తులకు సెకన్ల వ్యవధిలో వెళ్లింది. మధ్యలో రౌండ్‌రౌండ్‌కు ఆధిక్యం మారింది. చివరి రౌండ్ ఫలితాలు కొద్దిగా ఆలస్యం కావడంతో ఎవరూ గెలుపొందారు అనే అంశంపై కాసేపు ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

ఫలితాల వెల్లడిలో ఆలస్యం

నాగర్‌కర్నూల్: రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కాగా.. మొదటి రౌండ్ ఫలితం కోసం దాదాపు 2 గంటలపాటు ఎదురుచూడాల్సి వచ్చింది. ఇతర జిల్లాల్లో 8:30 గంటలకే మొదటి రౌండ్ ఫలితం వెల్లడించారని.. ఇక్కడ ఎందుకు చెప్పడంలేదని ప్రశ్నించగా, నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ఎట్టకేలకు 10:30 గంటలకు మొదటి రౌండ్ ఫలితాలను వెల్లడించారు.

మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 31 మంది బరిలో నిలిచారు. ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 16,83,709 మంది ఓటర్లు ఉండగా.. 12,21,748 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో నోటాకు 4,330 ఓట్లు పడ్డాయి. టెండర్ ఓటు ఒకటి కాగా.. 953 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. అయితే ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోరు కొనసాగినట్లు ఓట్ల లెక్కింపులో స్పష్టమైంది. బీఆర్ఎస్‌కు సిట్టింగ్ స్థానంలో నామమాత్రంగానే ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు 5,10,747 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి 5,06,247 ఓట్లు వచ్చాయి. డీకే అరుణ 4,500 ఓట్ల మెజార్టీతో చల్లాపై విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి 1,54,792 ఓట్లు మాత్రమే రాగా.. ఆయన మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు.

మహబూబ్‌నగర్ : 4,500 ఓట్లతో డీకే గెలుపు


ఆద్యంతం ఉత్కంఠ..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేసి 142 రౌండ్లలో ఓట్లు లెక్కించారు. కొడంగల్, దేవరకద్ర, మక్తల్‌కు సంబంధించి 21 రౌండ్ల చొప్పున, నారాయణపేట, మహబూబ్‌నగర్, జడ్చర్ల 20 రౌండ్ల చొప్పున, షాద్‌నగర్ అసెంబ్లీకి సంబంధించి 19 రౌండ్లలో లెక్కింపు కొనసాగింది. ఓట్ల లెక్కింపులో డీకే అరుణ, చల్లా మధ్య విజయం దోబూచులాడగా.. ఆద్యంతం ఉత్కంఠ నెలకొంది. తొలి నాలుగు రౌండ్లలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ వరుస మెజార్టీతో దూసుకెళ్లింది. ఐదో రౌండ్‌లో కాంగ్రెస్ స్వల్పంగా 375 ఓట్ల ఆధిక్యతను సాధించింది. అప్పటికే డీకే అరుణ 11,272 ఓట్ల మెజార్టీతో ఉన్నారు. ఇక ఆరు నుంచి ఎనిమిది రౌండ్ల వరకు డీకే అరుణ వరుసగా ఆధిక్యతను సాధించింది. ఈ రౌండ్లలో 7,491 మెజార్టీ రాగా.. అంతకు మునుపువి కలుపుకొని 18,763 ఆధిక్యతతో ముందంజలో నిలిచింది. తొమ్మిదో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 5,453 మెజార్టీ వచ్చింది. ఆ తర్వాత పదో రౌండ్‌లో బీజేపీకి 2,636 ఓట్ల ఆధిక్యత లభించింది. అనంతరం కాంగ్రెస్‌కు 11వ రౌండ్‌లో 504, 12వ రౌండ్‌లో అత్యధికంగా 6,966 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఆ తర్వాత 13, 14 రౌండ్లలో బీజేపీకి, 15, 16, 17 రౌండ్లలో కాంగ్రెస్‌కు ఆధిక్యత వచ్చింది. 18వ రౌండ్ మళ్లీ బీజేపీ కాగా.. 19 నుంచి 21 వరకు కాంగ్రెస్ అభ్యర్థి చల్లా ఆధిక్యతను కనబర్చారు.

ప్రభావం చూపని స్వతంత్రులు

పాలమూరు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 16,83,709 ఓట్లు ఉండగా.. 12,21,748 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 4,330 ఓట్లు నోటాకు పడగా.. మరో 953 ఓట్లు రిజెక్ట్ అయ్యాయి. ఇక బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు 5,10,747 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి 5,06,247, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి 1,54,792 ఓట్లు వచ్చాయి. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులలో కొంత మేర ఓట్లు సాధించగా.. పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. స్వతంత్రుల్లో అత్యధికంగా కిన్నెర యాదగిరికి 4,470 ఓట్లు రాగా.. అత్యల్పంగా ముడావత్ బాలరాజు నాయక్‌కు 183 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి మహ్మద్ అల్లావుద్దీన్‌కు 3,077, బహుజన ముక్తి పార్టీ అభ్యర్థి రహమాన్‌కు 503, వీసీకే అభ్యర్థి కె.శంకర్‌రెడ్డికి 432, డీఎస్పీ అభ్యర్థి జి.రాకేష్‌కు 2,618, తెలంగాణ జాగీర్ పార్టీ అభ్యర్థి నరేష్‌రెడ్డికి 420, జై స్వరాజ్ పార్టీ అభ్యర్థి ఎం.ఆంజనేయులుకు 1,020, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి బి.రవీందర్‌కు 1,085, ఏడీఆర్‌పీ అభ్యర్థి టి.వెంకటేశ్వర్లు 6,378, స్వతంత్ర అభ్యర్థులు అంజయ్య 1,676, ఉదయ్‌తేజ్ నాయక్‌కు 1,027, ఎస్.ఉమాశంకర్‌కు 2,214, కె.శ్రీనివాస్‌యాదవ్‌కు 3,451, కుర్వ వెంకటయ్యకు 4,249, గోవిందమ్మకు 2,748, దినేష్‌కు 1,727, ఎన్.శ్రీనివాసులుకు 985, ఎం.నవీన్‌రెడ్డికి 952, పి.సందీప్‌కుమార్‌రెడ్డికి 262, బండ సత్యనారాయణకు 264, విజయకు 596, టి.విష్ణువర్ధన్‌రెడ్డికి 229, వెంకట రమణకు 353, ఏ.శ్రీనివాసులుకు 438, ఎస్.సరోజనమ్మకు 1,565, హనుమేష్‌కు 3,225, హరిందర్‌రెడ్డికి 3,815 ఓట్లు వచ్చాయి.

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో అభ్యర్థులు, పార్టీల వారీగా పోలైన ఓట్లు



మెజార్టీ	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
4,500	16,83,709	12,21,748

తిరస్కరణకు గురైనవి	టెండర్ ఓటు
953	1

రౌండ్ల వారీగా ఫలితాలు..

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	మెజార్టీ(పార్టీ)
01.	25,957	25,329	9,434	628 (బీజేపీ)
02.	26,180	24,215	10,622	1,965 (బీజేపీ)
03.	28,406	24,015	7,705	4,391 (బీజేపీ)
04.	26,877	22,589	8,442	4,288 (బీజేపీ)
05.	23,432	23,807	10,659	375 (కాంగ్రెస్)
06.	26,443	22,525	8,743	3,918 (బీజేపీ)
07.	24,909	22,568	8,309	2,341 (బీజేపీ)
08.	26,710	25,478	7,552	1,232 (బీజేపీ)
09.	22,576	28,029	8,237	5,453 (కాంగ్రెస్)
10.	27,442	24,806	7,165	2,636 (బీజేపీ)
11.	26,911	27,415	5,608	504 (కాంగ్రెస్)
12.	23,801	30,767	6,270	6,966 (కాంగ్రెస్)
13.	30,960	25,287	6,777	5,673 (బీజేపీ)
14.	25,752	24,264	7,474	1,488 (బీజేపీ)
15.	23,630	25,203	6,519	1,573 (కాంగ్రెస్)
16.	21,027	25,923	8,399	4,896 (కాంగ్రెస్)
17.	26,656	27,041	6,030	385 (కాంగ్రెస్)
18.	27,083	26,511	6,815	572 (బీజేపీ)
19.	23,938	24,626	6,805	688 (కాంగ్రెస్)
20.	14,990	18,341	5,016	3,351 (కాంగ్రెస్)
21.	3,067	4,372	1,717	1,305 (కాంగ్రెస్)



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న డీకే అరుణ

తొలి మహిళా ఎంపీగా రికార్డు

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు 1952 నుంచి ఇప్పటి వరకు 17 పర్యాయాలు ఎన్నికలు నిర్వహించగా.. రామేశ్వర్‌రావు, మల్లికార్జున్‌గౌడ్ నాలుగుసార్ల చొప్పున ఎన్నికయ్యారు. అలాగే ఎస్.జైపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి రెండుసార్లు, జనార్దన్‌రెడ్డి, ముత్యాల్‌రావు, విఠల్‌రావు, కేసీఆర్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఒక్కోసారి ఎంపీలుగా గెలుపొందగా.. ఒక్క మహిళ కూడా ఎంపీగా ఎన్నిక కాలేదు. 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి బరిలోకి దిగి రెండో స్థానంలో నిలిచిన డీకే అరుణ.. తాజాగా పాలమూరు మహిళా ఎంపీగా తొలిసారి గెలిచి రికార్డు సృష్టించారు. ప్రస్తుత ఎన్నికల్లో 5,10,747 ఓట్లు సాధించి 4,500 మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిపై విజయం సాధించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో..

మహబూబ్‌నగర్‌లో ఈవీఎంల ఓట్లకు సంబంధించి అన్ని రౌండ్లు కలిపి డీకే అరుణకు 5,06,747 ఓట్లు, చల్లా వంశీచంద్‌రెడ్డికి 5,03,111 ఓట్లు పోలయ్యాయి. 3,636 ఓట్ల మెజార్టీతో డీకే అరుణ ముందంజలో నిలిచారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి మొత్తం 8,708 పోల్ కాగా.. ఇందులో చెల్లుబాటు కానివి 847, తిరస్కరణకు గురైనవి 106 పక్కనపెట్టారు. మిగిలిన వాటిలో డీకే అరుణకు 4 వేలు, చల్లా వంశీచంద్‌రెడ్డికి 3,136, మన్నె శ్రీనివాస్‌రెడ్డికి 496 పోలయ్యాయి. ఈవీఎంల ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ కలిపితే డీకే 4,500 ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి అయిన చల్లాపై గెలుపొందారు.

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 14,280 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో 5,813 ఓట్లు కాంగ్రెస్‌కు, 5,760 ఓట్లు బీజేపీ, 2,127 ఓట్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి 53 ఓట్లు అధికంగా పోల్ అయ్యాయి. నోటాకు 332 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు తమ ఓటు వేశారు.

కందనూలు హస్తగతం

నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కై వసం చేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి 94,414 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 12,05,275 ఓట్లకు గానూ కాంగ్రెస్ అభ్యర్థికి 4,59,259 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ 3,70,658 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. బీజేపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 3,21,343 ఓట్లతో మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గద్వాల మినహా మిగతా అన్నిచోట్ల కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది.



ధ్రువపత్రం అందుకుంటున్న మల్లురవి. చిత్రంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, నారాయణరెడ్డి


మల్లురవి మూడోసారి..

కౌంటింగ్ ప్రారంభించిన మొదటి రౌండ్ నుంచే కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొదటి రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌పై మల్లురవి 4,707 ఓట్ల ఆధిక్యం సాధించారు. రెండు, మూడో రౌండ్‌లో రెండోస్థానంలో ఉన్న బీజేపీ అభ్యర్థి భరత్‌పై ఆధిక్యం లభించింది. నాలుగో రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి ఆధిక్యం ప్రదర్శించగా, మిగతా రౌండ్లలో చివరి వరకు కాంగ్రెస్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. కాగా.. మల్లురవి నాగర్‌కర్నూల్ స్థానం నుంచి మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. మొదట 1991, ఆతర్వాత 1998 ఎన్నికల్లో ఇక్కడి నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు.

కొల్లాపూర్, అచ్చంపేటలో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అత్యధికంగా 39,089 ఓట్ల మెజార్టీ లభించింది. తర్వాత అచ్చంపేట నియోజకవర్గంలో 37,864 ఓట్ల మెజార్టీ రాగా, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో తక్కువగా 2,565 ఓట్ల స్వల్ప మెజార్టీ వచ్చింది. గద్వాల నియోజకవర్గ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపడం గమనార్హం. ఈ నియోజకవర్గంలో బీజేపీకి 19,631 ఓట్ల ఆధిక్యం లభించింది. అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలవగా, అలంపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తిలో బీజేపీ రెండో స్థానంలో నిలిచింది.

నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో అభ్యర్థులు, పార్టీల వారీగా పోలైన ఓట్లు



మెజార్టీ	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
94,414	17,38,254	12,052,275

రౌండ్ల వారీగా ఫలితాలు..

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	మెజార్టీ(పార్టీ)
01.	18,890	24,976	20,269	4,707(కాంగ్రెస్)
02.	20,062	22,403	18,448	2,341(కాంగ్రెస్)
03.	18,377	20,463	17,607	2,086(కాంగ్రెస్)
04.	20,749	19,485	16,272	1,264(బీజేపీ)
05.	19,539	22,448	17,965	2,909(కాంగ్రెస్)
06.	18,882	23,844	17,101	4,962(కాంగ్రెస్)
07.	21,208	24,263	14,460	3,055(కాంగ్రెస్)
08.	25,102	25,812	14,987	710(కాంగ్రెస్)
09.	22,122	22,224	14,607	102(కాంగ్రెస్)
10.	18,395	25,780	16,294	7,385(కాంగ్రెస్)
11.	17,712	25,169	18,632	6,537(కాంగ్రెస్)
12.	16,282	23,278	16,329	6,949(కాంగ్రెస్)
13.	19,369	23,917	16,777	4,548(కాంగ్రెస్)
14.	21,814	24,427	14,099	2,613(కాంగ్రెస్)
15.	18,732	21,872	14,905	3,140(కాంగ్రెస్)
16.	18,934	24,939	15,786	6,005(కాంగ్రెస్)
17.	14,612	20,390	15,105	5,285(కాంగ్రెస్)
18.	13,791	20,311	14,370	5,941(కాంగ్రెస్)
19.	12,155	20,006	13,264	6,742(కాంగ్రెస్)
20.	5,244	14,101	7,714	6,387(కాంగ్రెస్)
21.	2,462	7,654	3,537	4,117(కాంగ్రెస్)
22.	117	880	341	539(కాంగ్రెస్)

ఊహకందని తీర్పు

- నల్లమలలో కాంగ్రెస్ పార్టీకి 37,864 ఓట్ల మెజార్టీ



అచ్చంపేట: నల్లమలలో కాంగ్రెస్ పార్టీకి ఊహకందని రీతిలో భారీ మెజార్టీ లభించింది. అచ్చంపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి 37,864 ఓట్ల మెజార్టీని కట్టబెట్టారు. అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, పదర, వంగూరు, చారకొండ మండలాల పరిధిలో మొత్తం 2,47,729 మంది ఓటర్లు ఉన్నారు. మే 13న జరిగిన పోలింగ్‌లో 1,61,301 మంది ఓటుహక్కు వినియోగించుకోగా.. 65.11 శాతం పోలింగ్ నమోదైంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1,700 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 339 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు 16 టేబుళ్లలో 22 రౌండ్లలో కొనసాగింది. మొదటి రౌండ్ నుంచి చివరి వరకు కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ఆధిక్యం కొనసాగించారు. మల్లు రవికి 77,870 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 40,006, బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌కు 33,828 ఓట్లు పోలయ్యాయి. ఇతరులకు 7,979, నోటాకు 746 ఓట్లు వచ్చాయి.

వరుసగా రెండుసార్లు 'చల్లా' ఓటమి

పాలమూరు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి వరుసగా రెండుసార్లు ఓటమిపాలయ్యారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో చల్లా వంశీచంద్‌రెడ్డి 1,93,631 ఓట్లు సాధించి 19.66 శాతంతో మూడోస్థానంలో నిలిచారు. ఈసారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డి 5,06,247 ఓట్లు సాధించి, ద్వితీయ స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో 3,12,616 ఓట్లు అదనంగా వచ్చాయి.

తమ్ముడూ.. గట్టి పోటీ ఇచ్చావు

- బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌తో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి



ఫలితాల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మల్లు రవి, భరత్‌ప్రసాద్

సాక్షి, నాగర్‌కర్నూల్: 'తమ్ముడూ.. తక్కువ సమయంలోనే ప్రజా నాయకుడిగా ఎదిగావు. ఎన్నికల్లో నాకు గట్టి పోటీ ఇచ్చావు. ఓటమికి బాధపడొద్దు. ఎంపీగా, ఎమ్మెల్యేగా ఓడిపోయినా పర్లేదు కానీ.. నాయకుడిగా ఓడిపోవద్దు. నేను కూడా గత ఎన్నికల్లో ఓడిపోయాను. ఎంపీగా పనిచేశాక, మరో 25 ఏళ్లపాటు మాజీ ఎంపీగా ఉండిపోయాను. ఇప్పుడు నాకు ప్రజలు అవకాశం ఇచ్చారు. అనతి కాలంలోనే గొప్ప పోరాటం ప్రదర్శించావు' అంటూ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ధైర్యం చెప్పారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కలుసుకున్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అభినందనలు చెప్పారు. భరత్‌ను ఆలింగనం చేసుకున్న మల్లు రవి.. ప్రజల్లో ఎప్పటికీ నాయకుడిగా ఉండాలని అన్నారు.

సంబరాలకు దూరంగా..

పాలమూరు: మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా డీకే అరుణ గెలుపొందినట్లు జిల్లా రిటర్నింగ్ అధికారి రవినాయక్ ధ్రువీకరణ పత్రం అందించారు. అంతకుముందు కౌంటింగ్ కేంద్రానికి డీకే అరుణ ఉదయం 7 గంటల ప్రాంతంలో చేరుకుంది. అప్పటి నుంచి ఫలితాలు వచ్చే వరకు అక్కడే ఉన్నారు. గెలిచిన తర్వాత పీయూ ఎదుట బీజేపీ నేతలు బాణసంచా కాల్చడంతోపాటు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అయితే ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఊరేగింపు నిర్వహించకుండానే డీకే అరుణ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

■ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ఉదయం 7 గంటల ప్రాంతంలో పీయూ కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్నారు. సాయంత్రం 4.40 ప్రాంతంలో అన్ని రౌండ్ల లెక్కింపు పూర్తయిన తర్వాత బీజేపీ ఆధిక్యంలో ఉండటం.. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తున్న సమయంలో చల్లా వంశీచంద్‌రెడ్డితోపాటు ఆయన భార్య తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు తెలుస్తోంది. దీంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కలిసి చల్లా వంశీచంద్‌రెడ్డిని కౌంటింగ్ కేంద్రం నుంచి తీసుకువెళ్లారు.

విజయోత్సవ ర్యాలీ

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించిన మల్లు రవితో పాటు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, మేఘారెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతానని అన్నారు. తనకు ఓటువేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

వార్ వన్‌సైడ్..!

కొడంగల్‌లో కాంగ్రెస్.. నారాయణపేటలో బీజేపీ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని నారాయణపేట, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వార్ వన్‌సైడ్‌గా నడిచినట్లు కౌంటింగ్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి 21,854 ఓట్ల ఆధిక్యత లభించింది. తొలి రౌండ్ నుంచి చివరి 21వ రౌండ్ వరకూ స్పష్టమైన మెజార్టీని ప్రదర్శించారు. అదేవిధంగా ఈ నియోజకవర్గాన్ని ఆనుకుని ఉన్న జిల్లా కేంద్రమైన నారాయణపేట నియోజకవర్గంలో ఓటర్లు బీజేపీకి జై కొట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా.. ఐదు, ఎనిమిది, 20వ రౌండ్లలో మాత్రమే కాంగ్రెస్ స్వల్ప మెజార్టీ సాధించింది. మిగతా అన్ని రౌండ్లలోనూ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ స్పష్టమైన ఆధిక్యత (19,884 ఓట్లు) సాధించారు.

కొడంగల్ సెగ్మెంట్‌లో రౌండ్ల వారీగా సాధించిన ఓట్లు ఇలా..

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	మెజార్టీ (పార్టీ)
01.	2,491	4,509	2,018 (కాంగ్రెస్)
02.	2,510	4,058	1,548 (కాంగ్రెస్)
03.	2,921	3,891	970 (కాంగ్రెస్)
04.	2,799	4,188	1,389 (కాంగ్రెస్)
05.	2,864	2,957	93 (కాంగ్రెస్)
06.	3,943	4,125	182 (కాంగ్రెస్)
07.	3,227	4,833	1,606 (కాంగ్రెస్)
08.	3,111	4,065	954 (కాంగ్రెస్)
09.	3,052	5,204	2,152 (కాంగ్రెస్)
10.	3,813	4,038	225 (కాంగ్రెస్)
11.	4,059	4,098	39 (కాంగ్రెస్)
12.	3,365	4,399	1,034 (కాంగ్రెస్)
13.	3,033	4,407	1,374 (కాంగ్రెస్)
14.	2,813	3,856	1,043 (కాంగ్రెస్)
15.	2,515	3,693	1,178 (కాంగ్రెస్)
16.	2,560	4,043	1,483 (కాంగ్రెస్)
17.	3,057	4,107	1,050 (కాంగ్రెస్)
18.	3,558	5,170	1,612 (కాంగ్రెస్)
19.	3,451	3,732	281 (కాంగ్రెస్)
20.	3,044	4,474	1,430 (కాంగ్రెస్)
21.	374	567	193 (కాంగ్రెస్)

నారాయణపేట సెగ్మెంట్‌లో రౌండ్ల వారీగా సాధించిన ఓట్లు ఇలా..

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	మెజార్టీ (పార్టీ)
01.	4,388	2,975	1,413 (బీజేపీ)
02.	3,175	3,050	125 (బీజేపీ)
03.	3,905	2,768	1,137 (బీజేపీ)
04.	5,502	2,684	2,818 (బీజేపీ)
05.	3,206	4,212	1,006 (కాంగ్రెస్)
06.	3,924	2,291	1,633 (బీజేపీ)
07.	4,158	2,797	1,361 (బీజేపీ)
08.	2,899	3,380	481 (కాంగ్రెస్)
09.	3,750	3,261	489 (బీజేపీ)
10.	4,859	2,678	2,181 (బీజేపీ)
11.	4,697	3,036	1,661 (బీజేపీ)
12.	4,223	3,416	807 (బీజేపీ)
13.	4,958	2,657	2,301 (బీజేపీ)
14.	3,961	2,673	1,288 (బీజేపీ)
15.	3,758	3,520	238 (బీజేపీ)
16.	2,997	2,341	656 (బీజేపీ)
17.	3,786	2,695	1,091 (బీజేపీ)
18.	4,378	2,814	1,564 (బీజేపీ)
19.	3,964	3,267	697 (బీజేపీ)
20.	558	647	89 (కాంగ్రెస్)

బీజేపీ 4.. కాంగ్రెస్ 3..

- లోక్‌సభ ఎన్నికల్లో కమలానికి ఓటర్ల మద్దతు
- అసెంబ్లీతో పోలిస్తే పుంజుకున్న వైనం
- 2019లో 2 శాసనసభ స్థానాల్లో.. తాజాగా నాలుగింట ఆధిక్యం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంది. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో ఏడు నియోజకవర్గాలు ఉండగా.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఆయా స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు మూడో స్థానంలోనే నిలిచారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీకి ఓటు బ్యాంక్ గణనీయంగా పెరిగింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, దేవరకద్ర, మక్తల్ శాసనసభ సెగ్మెంట్లలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు మెజార్టీ ఓట్లు పోలయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీతోపాటు షాద్‌నగర్, జడ్చర్లలో కాంగ్రెస్ అభ్యర్థి చల్లాకు ఆధిక్యత లభించింది. 2019లో మక్తల్, మహబూబ్‌నగర్ మాత్రమే బీజేపీకి ఆధిక్యత లభించగా.. తాజా ఎన్నికల్లో మక్తల్, మహబూబ్‌నగర్‌తోపాటు నారాయణపేట, దేవరకద్ర అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ ఆధిక్యతను ప్రదర్శించింది.

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఫలితాలు (తాజా)..

అసెంబ్లీ స్థానం	బీజేపీ	కాంగ్రెస్	ఆధిక్యం (పార్టీ)
కొడంగల్	62,560	84,414	21,854 (కాంగ్రెస్)
నారాయణపేట	77,046	57,162	19,884 (బీజేపీ)
మహబూబ్‌నగర్	80,874	73,273	7,601 (బీజేపీ)
జడ్చర్ల	66,639	71,518	4,879 (కాంగ్రెస్)
దేవరకద్ర	72,538	70728	1,810 (బీజేపీ)
మక్తల్	78,994	69,916	9,078 (బీజేపీ)
షాద్‌నగర్	68,096	76,100	8,004 (కాంగ్రెస్)

నాగర్‌కర్నూల్‌లో మారిన లెక్కలు

- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి పెరిగిన ఓటింగ్
- తగ్గిన కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటింగ్



ఎంపీ మల్లు రవిని అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, వంశీకృష్ణ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

నాగర్‌కర్నూల్: గతేడాది డిసెంబర్‌లో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు.. ప్రస్తుత ఎంపీ ఎన్నికల ఫలితాలకు పొంతనే లేకుండా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్, గద్వాల మినహా మిగిలిన నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీగా పోటీ పడ్డాయి. అప్పటి ఓట్లతో పోలిస్తే ఈ ఎన్నికల్లో రెండు పార్టీలు వెనుకబడ్డాయి. అయితే ఓటింగ్ శాతం కొంత తగ్గినా కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి విజయం సాధించగా బీఆర్ఎస్ ఎక్కడ కూడా పోటీనివ్వలేకపోయింది. సెంబ్లీ ఎన్నికల్లో ఏ మాత్రం ప్రభావం చూపని బీజేపీ.. ఎంపీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్‌కు గట్టి పోటీనిచ్చిందనే చెప్పాలి. ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్క నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే లేకున్నా.. ఎంపీ ఎన్నికల్లో రెండోస్థానంలో నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో కలిపి బీజేపీకి 1,15,958 ఓట్లు రాగా.. కాంగ్రెస్‌కు 6,34,950 ఓట్లు, బీఆర్ఎస్‌కు 5,30,482 ఓట్లు వచ్చాయి. ఎంపీ ఎన్నికల విషయానికొస్తే కాంగ్రెస్‌కు 4,65,072 ఓట్లు రాగా.. బీజేపీ 3,70,658 ఓట్లు సాధించింది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో రెండోస్థానంలో నిలిచిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో 3,21,343 ఓట్లు సాధించి మూడోస్థానానికి పరిమితమైంది. ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్కచోట కూడా మెజార్టీ సాధించలేకపోయింది. గద్వాల, నాగర్‌కర్నూల్‌లో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించగా.. మిగిలిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఎక్కువ శాతం ఓటర్లు జైకొట్టారు. మొత్తంగా చూసుకుంటే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోలిస్తే కాంగ్రెస్‌కు 1,69,878 ఓట్లు, బీఆర్ఎస్ పార్టీకి 2,09,139 ఓట్లు తగ్గాయి. బీజేపీకి మాత్రం ఊహించని విధంగా 2,54,700 ఓట్లు పెరగడం విశేషం.

నియోజకవర్గాల వారీగా ప్రధాన పార్టీలు సాధించిన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	మెజార్టీ (పార్టీ)
అచ్చంపేట	77,870	33,828	40,006	37,864(కాంగ్రెస్)
అలంపూర్	59,790	55,053	53,466	4,737 (కాంగ్రెస్)
గద్వాల	59,238	78,869	45,247	19,631(బీజేపీ)
కల్వకుర్తి	63,720	51,177	51,893	10,383(కాంగ్రెస్)
కొల్లాపూర్	77,380	31,509	38,291	39,089(కాంగ్రెస్)
నాగర్‌కర్నూల్	54,047	51,482	46,771	2,565 (బీజేపీ)
వనపర్తి	67,214	62,987	43,542	4,227 (కాంగ్రెస్)
పోస్టల్ బ్యాలెట్	5,813	5,760	2,127	53 (కాంగ్రెస్)
మొత్తం	4,65,072	3,70,658	3,21,343	

ప్రజల దీవెనలు మర్చిపోలేను..



నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒక్క బీజేపీ ఎమ్మెల్యే లేకపోయినా ప్రజలే నాయకులుగా పెద్ద సంఖ్యలో మద్దతుగా నిలిచారు. విజయం దరిదాపుల్లోకి తీసుకెళ్లారు. ప్రజల మద్దతును ఎప్పటికీ మర్చిపోను. భవిష్యత్తులో పార్టీ కోసం, ప్రజల క్షేమం కోసం నిరంతరం పాటుపడతాను. నాకు ఓటువేసి మద్దతు తెలిపిన ప్రతీ ఒక్కరికీ పాదాభివందనాలు.

– పోతుగంటి భరత్‌ప్రసాద్, బీజేపీ అభ్యర్థి

పాలమూరులో బీజేపీ జోష్

- మొదటి రౌండ్ నుంచి ఆధిక్యం కనబర్చిన డీకే అరుణ
- రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి
- మూడోస్థానానికి పరిమితమైన బీఆర్ఎస్

పాలమూరు: మొదటి నుంచి తీవ్ర ఉత్కంఠ రేపిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఫలితాల్లో విజయం చివరికి బీజేపీ అభ్యర్థిని వరించింది. ఈవీఎంలో ఓట్లు లెక్కించడం ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచి కమలం జోరు కనిపించింది. మొదటి నుంచి చివరి వరకు ఏ రౌండ్‌లో కూడా వెనక్కి తిరిగి చూడలేదు. మెజార్టీలు పెరుగుతూ.. తగ్గుతూ వచ్చాయే తప్పా వెనకడుగు మాత్రం వేయలేదు. మొదటి రౌండ్ నుంచి స్వల్పంగా వచ్చిన ఆధిక్యం 8వ రౌండ్‌లో 18,388 భారీ లీడ్ వచ్చింది. ఆ తర్వాత మళ్లీ తగ్గుతూ.. పెరుగుతూ కన్పించింది. చివరి రౌండ్‌తోపాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 4,500 ఓట్ల మెజార్టీతో డీకే అరుణ గెలుపొందారు.

■ మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ సత్తా చాటింది. అధికార పార్టీ కంటే బీజేపీకి 7,601 అధికంగా వచ్చాయి. 2019లో బీజేపీకి 4,561 ఓట్లు అదనంగా వస్తే ఈసారి మరింత పెరిగాయి. ప్రస్తుతం పెరిగిన ఓట్లు చూస్తుంటే స్థానికంగా బీజేపీ చాలా వరకు పుంజుకున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ పరిధిలోని హన్వాడ, మహబూబ్‌నగర్ రూరల్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మధ్య హోరాహోరీగా సాగిన పట్టణంలో మాత్రం పూర్తిగా బీజేపీ ఆధిపత్యం సాధించింది. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీకి 80,874 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 73,273 ఓట్లు వచ్చాయి.

■ మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఒకప్పుడు మంచి క్యాడర్ కలిగిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కనీస పోటీ కూడా ఇవ్వలేని స్థితికి చేరుకుంది. హన్వాడ, మహబూబ్‌గర్ రూరల్, మహబూబ్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్‌కు బలమైన క్యాడర్ ఉన్న ప్రస్తుత ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయింది. ఈ ఎన్నికల్లో 13,087 ఓట్లు వచ్చాయి.

కమలం విజయంతో నిరాశలో కాంగ్రెస్



కోస్గి: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విజయం కాంగ్రెస్ పార్టీ శ్రేణులను నైరాశ్యంలోకి నెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఈ స్థానంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపే లక్ష్యంగా పనిచేశారు. తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ నుంచి భారీ మెజార్టీ సాధించి, కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపులో కీలకం కావాలని పలుమార్లు పర్యటించారు. గ్రామగ్రామానా విస్తృతంగా ప్రచారం చేయించారు. అయితే ఎన్నికల ఫలితం మాత్రం ఆశించిన దానికి భిన్నంగా వచ్చింది. దీంతో పార్టీ క్యాడర్ నిరుత్సాహంలో ఉన్నారు. గెలిచే సీటు చేజారిపోయిందని ఆందోళన చెందుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ప్రచారం కోసం నియోజకవర్గానికి కేవలం రెండుసార్లు మాత్రమే వచ్చారు. ఎంపీ అభ్యర్థి కోసం జిల్లాలో 6 సార్లు పర్యటించారు. ఎంతో కష్టపడ్డారు. అయినా అపజయం తప్పలేదు. లోక్‌సభ ఎన్నికల్లో కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్‌తో సమానంగా బీజేపీ ఓట్లు సాధించింది. కాంగ్రెస్ పార్టీకి 84,414, బీజేపీకి 62,560, బీఆర్ఎస్‌కు 15,958 ఓట్లు పోలయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌కు 33 వేల మెజార్టీ రాగా.. ఈ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి 21,854 వేల మెజార్టీ మాత్రమే వచ్చింది. సుమారు 12 వేల ఓట్లు తగ్గాయి.

బీజేపీకి పట్టం కట్టిన పట్టణ ఓటర్లు..

కొడంగల్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,41,794 మంది ఓటర్లు ఉండగా.. లోక్‌సభ ఎన్నికల్లో 1,71,143 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న పట్టణ ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో కోస్గి పట్టణం కాంగ్రెస్‌కు 4,838 ఓట్ల మెజార్టీ ఇవ్వగా.. పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 79 ఓట్లు మాత్రమే మెజార్టీ వచ్చింది. మద్దూర్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 44 ఓట్లు మాత్రమే అధికంగా రాగా.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఏకంగా 651 ఓట్ల మెజార్టీ ఇచ్చింది. మద్దూర్‌లో మొత్తం 11 బూత్‌లు ఉండగా.. 10 బూత్‌ల్లో బీజేపీ ఆధిక్యం సాధించగా, ఒకే బూత్‌లో మాత్రమే కాంగ్రెస్ ఆధిక్యతను కనబర్చింది.

అత్యల్ప మెజార్టీతో విజయ పరంపర

1971 నుంచి 2024 వరకు జరిగిన ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ ఇలా..

ఏడాది	ప్రత్యర్థి	విజేత	మెజార్టీ
1971	డీకే సత్యారెడ్డి (కాంగ్రెస్)	జె.రామేశ్వర్‌రావు (టీపీఎస్)	17,490
1977	డీకే సత్యారెడ్డి (బీఎల్‌డీ)	జె.రామేశ్వర్‌రావు (కాంగ్రెస్)	94,489
1980	జె.రామేశ్వర్‌రావు (కాంగ్రెస్)	మల్లిఖార్జున్ (ఐఎన్‌సీఐ)	64,339
1984	మల్లిఖార్జున్ (కాంగ్రెస్)	జైపాల్‌రెడ్డి (జేఎన్‌పీ	80,103
1989	జైపాల్‌రెడ్డి (జనతా దల్)	మల్లిఖార్జున్ (కాంగ్రెస్)	69,778
1991	గోపాల్‌రెడ్డి (టీడీపీ)	మల్లిఖార్జున్ (కాంగ్రెస్)	32,162
1996	డీకే అరుణ (టీడీపీ)	మల్లిఖార్జున్ (కాంగ్రెస్)	5,498
1998	మల్లిఖార్జున్ (కాంగ్రెస్)	జైపాల్‌రెడ్డి (జనతాదల్)	22,641
1999	మల్లిఖార్జున్ (కాంగ్రెస్)	ఏపీ జితేందర్‌రెడ్డి (బీజేపీ)	50,895
2004	ఎల్లారెడ్డి (టీడీపీ)	డి.విఠల్‌రావు	47,907
2009	డి.విఠల్‌రావు (కాంగ్రెస్)	కేసీఆర్ (బీఆర్ఎస్)	20,184
2014	జైపాల్‌రెడ్డి (కాంగ్రెస్)	ఏపీ జితేందర్‌రెడ్డి (బీఆర్ఎస్)	2,590
2019	డీకే అరుణ (బీజేపీ)	మన్నె శ్రీనివాస్‌రెడ్డి (బీఆర్ఎస్)	77,829
2024	చల్లా వంశీచంద్‌రెడ్డి (కాంగ్రెస్)	డీకే అరుణ (బీజేపీ)	4,500

పాలమూరు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 1971 నుంచి జరిగిన ఎన్నికలలో అత్యల్ప మెజార్టీ 2014లో వస్తే.. మళ్లీ ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ 4,500 మెజార్టీతో గెలుపొందారు. 1977 ఎన్నికల్లో 94,489 ఓట్ల అత్యధిక మెజార్టీ నమోదైంది.



జడ్చర్ల సెగ్మెంట్‌లో 'చే'జారిన ఓట్లు



జడ్చర్ల: జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ సత్తా చాటింది. అసెంబ్లీ ఎన్నికల్లో 14,630 ఓట్ల మెజార్టీ సాధించిన కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికల్లో 4,929 ఓట్ల మెజార్టీకే పరిమితమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 7,213 ఓట్లకే పరిమితమైన బీజేపీ.. లోక్‌సభ ఫలితాల్లో అనూహ్యంగా 66,589 ఓట్లకు పుంజుకుంది. కాంగ్రెస్ పార్టీకి 71,518, బీఆర్ఎస్‌కు 27,515 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలోని నవాబ్‌పేట మండలం నుంచి తొలి రౌండ్ మొదలుకాగా.. ఊర్కొండ మండలం 20వ రౌండ్‌తో ఓట్ల లెక్కింపు ముగిసింది. మొదటి, రెండవ రౌండ్‌లలో కాంగ్రెస్, 3, 4, 5 రౌండ్లలో బీజేపీ ఆదిక్యత సాధించింది. అదేవిధంగా 6, 7 రౌండ్‌లలో కాంగ్రెస్, 8, 9, 10 రౌండ్లలో బీజేపీకి మెజార్టీ వచ్చింది. 11, 12 రౌండ్లలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యతను కనబరుస్తూ వచ్చినా.. 13, 14, 15 రౌండ్లలో బీజేపీ తన ఆధిక్యతను కనబరిచింది. ఇక చివరి 16, 17, 18, 19, 20 రౌండ్లలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యతను కనబరిచి మొత్తంగా 4,378 ఓట్ల మెజార్టీని సాధించింది. జడ్చర్ల పట్టణంలో దాదాపు 3వేల ఓట్లకు పైగా బీజేపీ మెజార్టీని సాధించడంతో, కాంగ్రెస్ మెజార్టీకి అడ్డుకట్ట పడింది. అదే విధంగా నవాబ్‌పేట, రాజాపూర్, బాలానగర్ మండలాల్లో కాంగ్రెస్‌కు ధీటుగా బీజేపీ ఓట్లను సాధించింది. మిడ్జిల్, ఊర్కొండ మండలాల్లో కాంగ్రెస్ తన పరంపర కొనసాగించి, దాదాపు 4,929 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ ఊపిరి పీల్చుకుంది.

ఎమ్మెల్యే స్వగ్రామంలో ఎదురుగాలి..

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్వగ్రామంలోని 105 పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుగాలి వీచింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి 304 ఓట్లు రాగా.. బీజేపీకి 463 ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీజేపీకి 159 ఓట్లు అధికంగా పోలయ్యాయి.

బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయి



వనపర్తి విజయోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలనుకున్న బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో నూకలు చెల్లాయని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. మంగళవారం సాయంత్రం జిల్లాకేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. పదేళ్ల పాలనలో ప్రజలను ఆగం చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు వంద అడుగుల గొయ్యి తీసి పాతిపెట్టారన్నారు. కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వారసత్వ రాజకీయాలు చేసేందుకు నియోజకవర్గం ఎవరికీ ఎవరూ పట్టా రాసివ్వలేదని సొంత పార్టీలో మరో వర్గాన్ని విమర్శించారు. అక్షింతలు అడ్డుపెట్టుకొని దేవుడి పేరుతో రాజకీయాలు చేసే బీజేపీకి రామ మందిరం నిర్మించిన అయోధ్యలోనే పరాజయం ఎదురైందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఒక్కచోట కూడా గెలువదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన జోడోయాత్ర ఫలితంగా దేశవ్యాప్తంగా భారీగా ఎంపీ సీట్లు పెరిగాయన్నారు. మున్సిపల్ చైర్మన్ పి.మహేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శంకర్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్, సతీష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.